# నమస్తే తెలంగాణ
# ఖమ్మం

5 | ఖమ్మం, మంగళవారం 19 నవంబర్ 2024 | KHAMMAM


# రైతులను ఇబ్బంది పెట్టొద్దు..

- ధాన్యం బోనస్ నగదును రైతుల ఖాతాల్లో జమవేస్తాం
- పాలేరు ఐకేపీ కొనుగోలు కేంద్రం తనిఖీలో కలెక్టర్ ఖాన్



పాలేరు ధాన్యం కొనుగోలు కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

కూసుమంచి, నవంబర్ 18: కొనుగోలు కేంద్రాల్లో రైతులను ఇబ్బంది పెట్టొద్దని, ప్రభుత్వం ప్రకటించిన విధంగా ధాన్యం బోనస్ డబ్బులు క్వింటాకు రూ.500 చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేస్తామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పేర్కొన్నారు. పాలేరులో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంత ధాన్యం వచ్చింది? ఎంత కొనుగోలు చేశారు? కొనుగోలు చేసిన తర్వాత ఎక్కడికి పంపించారు? గన్నీ బ్యాగులు ఉన్నాయా? అని ఆరా తీశారు. చిరిగిన బ్యాగుల్లో ధాన్యం నింపొద్దని, అకాల వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతీ కేంద్రంలో టార్పాలిన్లు అందుబాటులో ఉండాలని, లేదంటే త్వరగా తెప్పించుకోవాలని సూచించారు. ధాన్యం తెచ్చిన రైతులతో మాట్లాడుతూ.. ఎన్ని రోజుల క్రితం వచ్చారు? తేమ శాతం ఎంత ఉంది? కొనుగోలు చేశారా? లేకుంటే ఎందుకు ఆలస్యమైంది? అని అడిగి తెలుసుకున్నారు. దీంతో పలువురు రైతులు తమ ధాన్యం కొనుగోలు చేయడం లేదని కలెక్టర్‌కు చెప్పగా.. దీని గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. దళారులకు ధాన్యం అమ్మకుండా ఐకేపీ కేంద్రాల్లో విక్రయించి రూ.500 బోనస్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం సన్న రకాల కొనుగోలు రిజిస్టర్‌ను పరిశీలించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని నిల్వ చేయకుండా ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని, ఆలస్యం చేస్తే రైతులకు నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ, శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఐకేపీ ఇన్‌చార్జి కొత్తా జ్యోతి, ఏవో రామడుగు వాణి, ఏపీఎం సత్యవర్ధన్ రాజు తదితరులు ఉన్నారు.

# దూది రైతుల దుఃఖం

- పత్తి పంటలో మద్దతు ధరకు అధికారుల మంగళం
- కొనుగోళ్లలో కొర్రీలతో కర్షకులు కన్నీటిపర్యంతం
- రైతుల రెక్కల కష్టమంతా ఖరీదుదారుల పరం
- ఖమ్మం జిల్లాలో నామమాత్రంగా సీసీఐ కొనుగోళ్లు
- ఏఎంసీలలో కేంద్రాల్లేక 'కాటన్' కర్షకుల అగచాట్లు
- ప్రజాప్రతినిధులు, రైతు సంఘాల వినతులు గాలికి..
- ఖమ్మంలో పత్తిరైతుల ఫైర్.. సీసీఐ అధికారుల ఘెరావ్
- తిరుమలాయపాలెంలో కాటన్ మిల్లు గేటుకు తాళం



ఖమ్మం పత్తి యార్డుకు రైతులు తీసుకొచ్చిన పత్తి బస్తాలు

**దూదిపూల రైతులకు అడుగడుగునా దుఃఖమే మిగులుతోంది. మద్దతు ధరకే విక్రయించుకోవాలంటూ ప్రకటనలు గుప్పిస్తున్న పాలకులు.. పరోక్షంగా ప్రైవేటు వ్యాపారులకు సహకరిస్తుండడంతో కర్షకులు కన్నీటిపర్యంతమవుతున్నారు. ఇక కోట్లాది కొర్రీలతో సీసీఐ అధికారులు మద్దతు ధరకు మంగళం పాడడంతో రైతుల రెక్కల కష్టం ఖరీదుదారుల పరమవుతోంది. అసలైన రైతులు ట్రాక్టర్లలో తెచ్చిన పత్తిని కొనేందుకు సవాలక్ష సాకులు చూపుతున్న సీసీఐ అధికారులు.. ప్రైవేటు వ్యాపారులు బొలేరో వాహనాల్లో తెచ్చిన పత్తిని కొనేందుకు మాత్రం ఎర్రతివాచీ పరుస్తున్నారు. ఖమ్మం జిల్లాలో సోమవారం రెండు చోట్ల చోటుచేసుకున్న ఘటనలు కాటన్ రైతుల కంట పడడంతో వారి ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో సీసీఐ అధికారులను ఘెరావ్ చేయగా.. తిరుమలాయపాలెంలో కాటన్ మిల్లు గేటుకు తాళం వేశారు. దీంతో పత్తి కొనుగోళ్లలో ప్రభుత్వ ఉదాసీన వ్యవహారం, వ్యాపారుల దోపిడీ మర్మం వంటివి మరోసారి వెలుగు చూశాయి.**

*-ఖమ్మం, నమస్తే తెలంగాణ ప్రతినిధి/ తిరుమలాయపాలెం, నవంబర్ 18*

జిల్లాలో ప్రైవేట్ వ్యాపారులు కొనుగోలు చేసిన పత్తి: **2,17,869 క్వింటాళ్లు**

సీసీఐ అధికారులు కొనుగోలు చేసిన పంట: **32,373 క్వింటాళ్లు**

పంట సీజన్‌కు రెండు నెలల ముందు నుంచే జిల్లాలో భారత పత్తి సంస్థ(సీసీఐ) కేంద్రాల ఏర్పాటుకు అధికారులు అనేక కసరత్తులు చేసినప్పటికీ ఆశించిన ఫలితం కన్పించడం లేదు. 'సీసీఐ కేంద్రాలు ఉన్నాయా?' అంటే 'ఉన్నాయి' అనే రీతిలో మాత్రమే అవి దర్శనమిస్తున్నాయి. ఈ ఏడాది వానకాలం సీజన్ పత్తి పంటను కొనుగోలు చేయించేందుకు జిల్లా అధికారులు ఆయా మండలాల్లో తొమ్మిది సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కానీ ప్రధానమైన ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో మాత్రం ఏర్పాటు చేయలేదు. కేవలం జిన్నింగ్ మిల్లులు ఉన్న చోట ఆయా మిల్లుల ఆవరణలో మాత్రమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఖమ్మం ఏఎంసీలో సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయనప్పటికీ ఇక్కడి పత్తి యార్డులో ప్రైవేటు వ్యాపారులు రైతుల పత్తిని కొనుగోలు చేస్తారు. అయినా ఇక్కడికి రోజుకు 30 వేల నుంచి 40 వేల వరకూ పత్తి బస్తాలను జిల్లా రైతులు, పొరుగు జిల్లాల రైతులు తీసుకొస్తున్నారు. ఇక్కడ సీసీఐ కేంద్రం లేకపోవడంతో వీరి పత్తిని వ్యాపారులు తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్నారు. కొందరు రైతులు శ్రమకోర్చి జిన్నింగ్ మిల్లుల్లోని సీసీఐ కేంద్రాలకు తీసుకెళ్లినా.. 8 నుంచి 12 శాతం మధ్య తేమ ఉంటేనే కొనుగోలు చేస్తామంటూ సీసీఐ అధికారులు కొర్రీలు పెడుతున్నారు. దీంతో చాలా మంది రైతులు ఎంతోకొంత ధరకు అక్కడే జిన్నింగ్ మిల్లు యజమానికి అమ్ముకొని ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. మరికొందరు రైతులు కాస్త ధైర్యం చేసి, రవాణా చార్జీలు భరించి మరుసటి రోజు ఖమ్మం ఏఎంసీలోని ప్రైవేటు వ్యాపారుల వద్దకు పంటను తెస్తున్నారు. దీంతో ఇక్కడ కూడా ఆ వ్యాపారులు రైతులను దోపిడీ చేస్తున్నారు.



గతంలో ఖమ్మం వ్యవసాయ మార్కెట్లో ఏర్పాటు చేసిన సీసీఐ కేంద్రానికి వాహనాల్లో వచ్చిన పత్తి పంట (ఫైల్)

సీసీఐ మద్దతు ధర రూ.7,521 ఉన్నప్పటికీ అందులో దాదాపు సగానికి తగ్గించి కొంటున్నారు. రైతులు నాణ్యమైన పత్తిని తెస్తున్నప్పటికీ తేమ శాతాన్ని బూచిగా చూపి ధరను అమాంతం తగ్గిస్తున్నారు. దీంతో రైతులు ఆగ్రహావేశాలకు గురవుతున్నప్పటికీ ప్రత్యామ్నాయం లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితిలో ప్రైవేట్ వ్యాపారులకు వారు చెప్పిన ధరకే అమ్ముకుంటున్నారు. గత వారం ఖమ్మం కలెక్టర్ ఇక్కడి ఏఎంసీని తనిఖీ చేసిన సమయంలో రైతుల పంటలో తేమ శాతాన్ని స్వయంగా పరీక్షించారు. 9 శాతం తేమ కలిగిన పంటకు వ్యాపారులు రూ.4,300 ధర పెట్టడంతో కలెక్టర్ ఆగ్రహించారు. అయినా ఖరీదుదారుల వైఖరిలో మార్పు రాలేదు. పైగా ధరలు మరింత తగ్గించి కొంటున్నారు.



ఖమ్మంలో సీసీఐ అధికారులను నిలదీస్తున్న పత్తి రైతులు

### ఏఎంసీలో సీసీఐ కేంద్రం లేనట్టేనా?

గతంలో మాదిరిగా ఖమ్మం ఏఎంసీలో సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయాలని, మద్దతు ధరకు పత్తిని కొనుగోలు చేయాలని రైతులు వేడుకుంటున్నారు. ఇదే డిమాండ్‌పై బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు, పార్టీ నాయకులు ఇటీవల ఏఎంసీని సందర్శించారు. సీపీఎం, సీపీఐ, ఎన్‌డీ పార్టీల నేతలు కూడా ఇక్కడ ఆందోళనలు చేపట్టారు. ఈ పార్టీలు చేసిన డిమాండ్లు, ఇచ్చిన వినతులు బుట్టదాఖలయ్యాయి.

## పత్తి రైతుల తిరుగుబాటు

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో పత్తి యార్డు సందర్శనకు వచ్చిన సీసీఐ అధికారులపై పత్తి రైతులు సోమవారం తిరగబడ్డారు. ఖమ్మం ఏఎంసీలో సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయడం లేదని, అనేక కొర్రీలు పెట్టి తమను నిలువు దోపిడీ చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ వారిని ఘెరావ్ చేశారు. సీసీఐ మేనేజర్ అర్జున్, అసిస్టెంట్ మేనేజర్ అవినాశ్ కలిసి సోమవారం ఖమ్మం ఏఎంసీ పత్తి యార్డులో పత్తి క్రయవిక్రయాల సందర్శనకు వచ్చారు. వీరిని చూసి ఆగ్రహానికి గురైన రైతులు వెంటనే వారిని చుట్టుముట్టి నిరసన తెలిపారు. ఇక్కడి ఖరీదుదారులు సవాలక్ష కొర్రీలతో తమను అరిగోస పెడుతున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఏఎంసీలో సీసీఐ కేంద్రం ఏర్పాటు చేయకుండా పరోక్షంగా ప్రైవేట్ వ్యాపారులకు సహకరిస్తున్నారంటూ ఘెరావ్ చేశారు. ఏముఖం పెట్టుకొని మార్కెట్ యార్డులో తిరుగుతున్నారని రైతులు తిరగబడ్డారు. తేమ శాతం 12లోపు ఉన్నదీ లేనిదీ తమకు తెలియకపోవడంతో ప్రైవేట్ వ్యాపారులు ఎంత తక్కువ ధర చెప్పినా అంతే అమ్ముకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సీసీఐ అధికారుల వైఖరి కారణంగానే తాము మద్దతు ధర పొందలేక పోతున్నామని మండిపడ్డారు. దీంతో అక్కడికి వచ్చిన జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి ఎంఏ అలీం, మార్కెట్ కమిటీ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్‌లు రైతులకు నచ్చచెప్పే ప్రయత్నం చేసినా వినలేదు. అయితే, ఖమ్మం ఏఎంసీలో సీసీఐ కేంద్రం ఏర్పాటు విషయంలో మాత్రం సీసీఐ అధికారులు స్పష్టత ఇవ్వకపోవడం గమనార్హం.



తిరుమలాయపాలెం: పత్తి కొనుగోలు చేయకపోవడంతో కాటన్ మిల్లు గేటు వద్ద నిరసన తెలుపుతూ సీసీఐ అధికారులను నిలదీస్తున్న రైతులు

### తిరుమలాయపాలెంలో మిల్లు గేటుకు తాళం..

తిరుమలాయపాలెం మండలం గోల్‌తండాలోని భాగ్యలక్ష్మి కాటన్ మిల్లు వద్ద కూడా రైతులు సోమవారం ఆందోళన చేపట్టారు. తేమ శాతం పేరుతో రైతుల పత్తి పంటను కొనుగోలు చేయని సీసీఐ అధికారులు.. ప్రైవేటు వ్యాపారులు బొలేరో వాహనాల్లో తెచ్చిన పత్తిని మద్దతు ధరకు కొనడంతో రైతులు ఆగ్రహించారు. మిల్లు గేటుకు తాళం వేసి నిరసన తెలిపారు. తమ పత్తిని కొనేందుకు సాకులు చెప్పి వ్యాపారుల పత్తిని ఎలా కొనుగోలు చేస్తున్నారంటూ నిలదీశారు. అయితే, వారు వ్యాపారులని తమకు తెలియదని, వారు కూడా రైతులే అనుకున్నామని అధికారులు సమాధానం చెప్పడం గమనార్హం. అయితే, మంత్రి పొంగులేటి ఇటీవల ఈ మిల్లును సందర్శించి సీసీఐ కొనుగోళ్లను పరిశీలించారు. మద్దతు ధర ఇవ్వాల్సిందేనని ఆదేశించారు. కానీ ఆచరణలో ఆయన ఆదేశాలు కూడా బేఖాతరు కావడం గమనార్హం.

### వ్యాపారులు తెచ్చిన పంటనే కొంటున్నారు..



రైతులు తెచ్చిన పత్తిని కొనని సీసీఐ అధికారులు.. వ్యాపారులు బొలేరో వాహనాల్లో తెచ్చే పత్తిని కొంటున్నారు. వారిద్దరి మధ్య ఉన్న అవగాహన మేరకు షరతుల్లేకుండా మద్దతు ధరకు కొనుగోలు చేస్తున్నారు. కానీ మాలాంటి రైతులం తెచ్చిన పంటకు కొర్రీలు పెడుతున్నారు. నాణ్యత లేదంటూ నా పత్తిని రెండు సార్లు తిప్పి పంపారు.

**–కొలిచం కోటేశ్వరరావు, రైతు, తిరుమలాయపాలెం**

### సగం లోడు దించాక వద్దన్నారు..



నేను 25 క్వింటాళ్ల పత్తిని తెచ్చాను. సీసీఐ అధికారులు నాణ్యతను పరిశీలించి రూ.7,220 ధర నిర్ణయించారు. ట్రాక్టర్‌ను మిల్లులోకి తీసుకెళ్లి సగం లోడు దించారు. ఈ లోపు మళ్లీ కొర్రీలు పెట్టారు. ఈ పత్తిని కొనలేమని తేల్చారు. ఇంటికి తీసుకెళ్లాలని సూచించారు. ఇలాంటి పరిస్థితి నాలాంటి ఎంతో మంది రైతులకు ఎదురవుతోంది.

**–మూడు జాలీ, లక్ష్మీదేవిపల్లి, తిరుమలాయపాలెం**

### కాళ్లు పట్టుకొని వేడుకున్నా కొనలేదు..



పత్తి కొనుగోలు చేయాలని సీసీఐ అధికారుల కాళ్లు పట్టుకున్నా కనికరించలేదు. నేను 25 క్వింటాళ్ల పత్తిని తెచ్చాను. తేమ ఎక్కువగా ఉందని నా పంటను కొనలేదు. కానీ బొలేరో వాహనాల్లో వ్యాపారులు తెచ్చిన పత్తిని మాత్రం తేమతో సంబంధం లేకుండా కొన్నారు. సీసీఐ అధికారులు లంచాలు తీసుకొని దళారుల పత్తి కొంటున్నారు.

**–వాంకుడోత్ శ్రీను, చెట్టుగూడెం, సూర్యాపేట**

## పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తాం..

### కలెక్టర్ జితేశ్ వి పాటిల్



చినరావిగూడెం వద్ద గోదావరి నదిని పరిశీలించి సూచనలు చేస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్ పాటిల్

మణుగూరు టౌన్, నవంబర్ 18: జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను మరింతగా అభివృద్ధి చేస్తామని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. చిన్నరావిగూడెం వద్ద గోదావరి తీర ప్రాంతాన్ని సోమవారం ఆయన సందర్శించారు. అక్కడి ప్రజలు, అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేశారు. చిన్నరావిగూడెం నుంచి పర్ణశాల వరకు గోదావరిలో బోటు ప్రయాణంతోపాటు పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. భక్తులతోపాటు ప్రయాణికుల అవసరాల కోసం బోట్లు ఏర్పాటు చేస్తామన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ రాఘవరెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, స్థానికులు ఉన్నారు.

## స్టడీ అవర్స్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి

### గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీవో రాహుల్



వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, నవంబర్ 18: గిరిజన గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో స్టడీ అవర్స్ నిర్వహణపై ప్రత్యేకాధికారులు, హెచ్‌ఎంలు, వార్డెన్ల పర్యవేక్షణ కచ్చితంగా ఉండాలని ఐటీడీఏ పీవో బి.రాహుల్ ఆదేశించారు. ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ గ్రామాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి పీవో అర్జీలను స్వీకరించారు. తన పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించి.. మిగిలిన వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి త్వరితగతిన పరిష్కరించేలా చూడాలన్నారు. ట్రైకార్ ద్వారా సబ్సిడీ రుణాలు, పోడు భూములు, వ్యక్తిగత సమస్యలు, స్వయం ఉపాధి పథకాల రుణాలు, పట్టా భూములకు రైతుబంధు తదితర సమస్యలపై అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ప్రతీ దరఖాస్తును ఆన్‌లైన్ చేయడంతోపాటు ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, ఎస్‌డీసీ రవీంద్రనాథ్, గురుకులం ఆర్‌సీవో నాగార్జునరావు, ఏవో రాంబాబు, ఎస్‌వో భాస్కరన్, ఏపీవో పవర్ ఏఈ మునీర్‌పాషా, డీటీఆర్‌వోఎఫ్ఆర్ లక్ష్మీనారాయణ, కొండరెడ్ల విభాగం అధికారి మణిధర్ తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలకు పాల్పడొద్దు

### పోలీస్ కమిషనర్ సునీల్‌దత్



కొనుగోలు కేంద్రంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న సీపీ

ముదిగొండ, నవంబర్ 18: పత్తి కొనుగోలు చేసే క్రమంలో తేమ శాతంతోపాటు కాంటాల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ హెచ్చరించారు. ముదిగొండ శివారులోని సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పత్తి విక్రయానికి తీసుకొచ్చిన రైతులతో మాట్లాడి.. ఎవరైనా ఇబ్బంది పెడుతున్నారా.. అని అడిగి తెలుసుకున్నారు. పత్తి రవాణా, బిల్లుల చెల్లింపు తదితరాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. పత్తి తేమ శాతాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు చేపట్టాలన్నారు. పత్తిలో తరుగు పేరుతో కటింగులు పెట్టొద్దని, రైతులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. సీపీ వెంట సీఐ మురళి తదితరులు ఉన్నారు.

## కొణతం దిలీప్ అరెస్టుపై తాతా మధు ఖండన

ఖమ్మం, నవంబర్ 18: తెలంగాణ ఉద్యమకారుడు, తెలంగాణ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ కొణతం దిలీప్‌ను అక్రమంగా అరెస్టు చేయడాన్ని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ సోమవారం ఒక ప్రకటనలో ఖండించారు. కోర్టు ఆదేశాల మేరకు విచారణ కోసం సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన దిలీప్‌ను పోలీసులు అరెస్టు చేయడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజా పాలన బదులు.. రాక్షస పాలన నడుస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టాలను ఉల్లంఘించి, రాష్ట్ర ప్రభుత్వానికి ఊడిగం చేస్తున్న కొందరు పోలీసు అధికారులు తీరు మార్చుకోవాలని, లేదంటే భవిష్యత్‌లో శిక్ష తప్పదని హెచ్చరించారు. అక్రమంగా అరెస్టు చేసిన దిలీప్‌ను బేషరతుగా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## గిరిజన సంఘం నేతల ముందస్తు అరెస్టు

- లగచర్ల వెళ్లకుండా అదుపులోకి తీసుకున్న పోలీసులు
- చంద్రుగొండ, టేకులపల్లి పోలీస్‌స్టేషన్లకు తరలింపు



చంద్రుగొండ పోలీసుల అదుపులో ఉన్న గిరిజన సంఘం నాయకులు



టేకులపల్లి పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల అదుపులో ఉన్న దరావత్ సురేశ్

చంద్రుగొండ/ టేకులపల్లి, నవంబర్ 18: గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో లగచర్లలోని గిరిజన కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్తున్న గిరిజన విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మూడ్ బాలాజీనాయక్, భారతీయ గోర్ బంజారా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవిచందర్ చౌహాన్‌లను చంద్రుగొండ పోలీసులు సోమవారం ముందస్తు అరెస్టు చేశారు. అలాగే సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు దరావత్ సురేశ్‌ను టేకులపల్లి పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా ఆయా పోలీస్‌స్టేషన్ల ఆవరణలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలోని గిరిజన రైతుల భూములను లాక్కోవాలని చూస్తున్న ప్రభుత్వ కుట్రను తిప్పికొడతామన్నారు. వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాలను పోషించుకునే పేద గిరిజనుల జోలికొస్తే సేవాలాల్ సేన ఆధ్వర్యంలో ఉద్యమిస్తామని, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. అరెస్టులతో కాంగ్రెస్ ప్రభుత్వం గిరిజనుల హక్కులను కాలరాయాలని చూస్తే ఊరుకునేది లేదన్నారు.

## ఆహారం కల్తీ చేస్తే కఠిన చర్యలు

- ఖమ్మం పర్యటనలో స్టేట్ ఫుడ్ సేఫ్టీ అధికారుల స్పష్టీకరణ
- నగరంలోని ఆహార పదార్థాల తయారీ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీ
- పలు దుకాణాలకు, తయారుదారులకు నోటీసులు, కేసుల నమోదు
- నాసికరం ఆహార పదార్థాలను గుర్తించి ధ్వంసం చేసిన అధికారులు



960 కేజీల కల్తీ అల్లం, వెల్లుల్లి మిశ్రమాన్ని చూపిస్తున్న అధికారులు

మామిళ్లగూడెం, నవంబర్ 18: ప్రజలు ఇష్టంగా తినే ఆహార పదార్థాలను కల్తీ చేసినా, నాసిరకంగా తయారు చేసి విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని స్టేట్ ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ అధికారులు స్పష్టం చేశారు. స్టేట్ ఫుడ్ సేఫ్టీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశాల మేరకు స్టేట్ ఫుడ్ సేఫ్టీ టాస్క్‌ఫోర్స్ బృంద అధికారులు.. జోనల్ అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ జ్యోతిర్మయి ఆధ్వర్యంలో సోమవారం ఖమ్మంలో పర్యటించారు. నగరంలోని పలు ఆహార పదార్థాల తయారీ కేంద్రాలను; అల్లం వెల్లుల్లి స్టోరేజ్, విక్రయ కేంద్రాలను; మిఠాయి తయారీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిక్కాబజార్‌లోని మ్యాజిక్ అల్లం, వెల్లుల్లి తయారీ కేంద్రంలో నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు గుర్తించారు. తయారుదారులు ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ లైసెన్స్ లేకుండా అల్లం పేస్టును తయారీ చేసి స్టోరేజ్ చేసి విక్రయిస్తున్నట్లు గుర్తించారు. కల్తీలు జరిగినట్లు గుర్తించిన రూ.1.32 లక్షల విలువైన 960 కేజీల అల్లం, వెల్లుల్లి మిశ్రమాన్ని సీజ్ చేశారు. సేకరించిన నమూనాలను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌లకు పంపించారు. చర్చికాంపౌండ్‌లో ఉన్న విజయలక్ష్మి పిండి వంటల కేంద్రంలో పూర్తి అపరిశుభ్రంగా ఉన్న వంట గదిలో ఆహార పదార్థాలు తయారు చేస్తున్నట్లు గుర్తించారు. క్యాన్సర్ కారకాలైన రసాయన రంగులను అధిక మోతాదులో స్వీట్లలో వినియోగిస్తున్నట్లు గమనించారు. అనుమతులు లేకుండా వీటిని తయారు చేసి విక్రయిస్తున్నట్లు తేల్చారు. కల్తీగా గుర్తించిన రూ.6,550 విలువైన ఆహార పదార్థాలను ధ్వంసం చేశారు. మయూరిసెంటర్‌లో ఉన్న హరి స్వీట్స్ దుకాణంలో పూర్తి అపరిశుభ్ర వాతావరణంలో స్వీట్లు తయారు చేస్తున్నట్లు తేలింది. అధిక మోతాదులో రసాయన రంగులు వాడుతున్నట్లు గుర్తించి రూ.6,950 విలువైన పదార్థాలను అక్కడే ధ్వంసం చేశారు. ఇంకా మరికొందరికి నోటీసులు జారీ చేశారు. అవసరమైతే కేసులు నమోదు చేసి సీజ్ చేస్తామని స్పష్టం చేశారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు రోహిత్‌రెడ్డి, స్వాతి, మనోజ్‌కుమార్, రతన్‌రావు పాల్గొన్నారు.



ఖమ్మంలోని ఓ ఆహార కేంద్రంలో సిబ్బందికి సూచనలిస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారులు

## ముగిసిన గ్రూప్-3 పరీక్షలు



ఖమ్మం పరీక్షా కేంద్రం వద్ద బందోబస్తులో పోలీసులు

మామిళ్లగూడెం, నవంబర్ 18: టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు నిర్వహించిన గ్రూప్-3 రాత పరీక్షలు సోమవారంతో ప్రశాంతంగా ముగిశాయి. ఖమ్మంలో 87 పరీక్షా కేంద్రాల్లో అభ్యర్థులు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి రెండో రోజు పరీక్ష రాశారు. భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంతోపాటు ఆయా కేంద్రాలను సీపీ సునీల్‌దత్, అదనపు కలెక్టర్లు సందర్శించారు. అభ్యర్థులను ఉదయం సెషన్‌లో 8:30 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిచ్చారు. పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు జరిగాయి. ప్రతి అభ్యర్థిని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే కేంద్రాల్లో లోపలికి అనుమతించారు. అయితే ఎంతమంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారనే వివరాలను రాష్ట్రస్థాయి అధికారులు ప్రకటిస్తారని నిర్వాహకులు తెలిపారు.

### భద్రాద్రి జిల్లాలోనూ..

కొత్తగూడెం ఎడ్యుకేషన్, నవంబర్ 18: జిల్లాలో రెండు రోజులపాటు నిర్వహించిన గ్రూప్-3 పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ముగిశాయి. పరీక్షల నిర్వహణకు అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయగా.. అభ్యర్థులు రెండో రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు అభ్యర్థులు పరీక్ష రాశారు. జిల్లా వ్యాప్తంగా 39 సెంటర్లలో పరీక్ష నిర్వహించగా.. కొత్తగూడెం లో 26, పాల్వంచలో 13 సెంటర్లు ఏర్పాటు చేశారు. మొత్తం 13,478 మంది అభ్యర్థులకు గాను 7,166 మంది పరీక్ష రాశారు. 53.17 హాజరు శాతం నమోదైంది. కలెక్టర్, ఎస్పీలు పరీక్షా సరళిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పలు సెంటర్లను తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.

## రూ.2.48 కోట్ల గంజాయి దహనం

54 కేసుల్లో పట్టుబడిన 993 కేజీల సరుకుకు నిప్పు



గంజాయిని దహనం చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

మామిళ్లగూడెం, నవంబర్ 18: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పలు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో తనిఖీల సందర్భంగా స్వాధీనం చేసుకున్న గంజాయిని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు సోమవారం దహనం చేశారు. భద్రాద్రి జిల్లా కొత్తగూడెం, మణుగూరు, ఇల్లెందు, అశ్వారావుపేట, పాల్వంచ స్టేషన్ల పరిధిలో 54 కేసుల్లో పట్టుబడిన రూ.2.48 కోట్ల విలువైన 993 కేజీల గంజాయిని ఖమ్మం జిల్లా తల్లాడ మండలం గోపాల్‌పేట గ్రామంలో ఉన్న ఏడబ్ల్యూఎం కన్సల్టింగ్ లిమిటెడ్‌లో దహనం చేశారు. కొత్తగూడెం స్టేషన్‌లో 25 కేసుల్లోని 33.790 కేజీలు, పాల్వంచ స్టేషన్‌లో 15 కేసుల్లోని 408.371 కేజీలు, మణుగూరు స్టేషన్‌లో 2 కేసుల్లో 52.520 కేజీలు, ఇల్లెందు స్టేషన్‌లో 10 కేసుల్లో 108.372 కేజీలు, అశ్వారావుపేట స్టేషన్‌లో 2 కేసుల్లో పట్టుకున్న 37.500 కేజీల గంజాయిని దహనం చేయించినట్లు డిప్యూటీ కమిషనర్ తెలిపారు. కాగా.. భారీ ఎత్తున పట్టుకుని స్వాధీనం చేసుకున్న గంజాయిని కాల్చివేయడం పట్ల జిల్లా అధికారులను ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి అభినందించారు. దహనం కార్యక్రమంలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ గణేశ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎక్సైజ్ అధికారి జానయ్య, సీఐలు పాల్గొన్నారు.